ప్రజలకు అన్నీ శుభాలు కలగాలి



బీజేపీ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద పార్టీ ఎన్నికల ప్రచార రథాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలకు మేలు కలగాని కోరుకున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి బీజేపీ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు మాట్లాడుతూ.. మే 13 వరకు పార్టీ నేతలు, కార్యకర్తలంతా ప్రజల మధ్యలోనే ఉండి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించేలా ప్రచారం చేపట్టాలని సూచించారు. పార్టీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, శ్రీనివాస్, వీరెల్లి చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, కేశబోయిన శ్రీధర్ తదితరులున్నారు.



ఉప్పరిగూడ రామాలయంలో పంచాంగ శ్రవణం



అష్టలక్ష్మి గుడిలో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఉగాది సందర్భంగా సచివాలయనగర్‌లో సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న ఫోరం సభ్యులు

ఘనంగా శ్రీక్రోధినామ ఉగాది వేడుకలు



మలక్‌పేట్ హరిహర క్షేత్రంలో పంచాగ శ్రవణం



దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న డీఎం హరి తదితరులు



దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో పంచాంగ శ్రవణం

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: నూతన సంవత్సరాది .. శ్రీక్రోధి నామ ఉగాది పర్వదినాన్ని ఎల్బీనగర్/మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి తలంటూ స్నానాలు చేసి ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి, నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. ఉగాది సందర్భంగా ఆలయాలు, పలు ఫంక్షన్‌హాళ్లు, కమ్యూనిటీహాళ్లలో కాలనీల అసోసియేషన్, ఆలయాల నిర్వాహకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానికులు హాజరై నూతన సంవత్సరంలో జరగబోయే విశేషాలను శ్రద్ధగా విన్నారు. ఈ ఏడాది తమ జాతకం ఎలా ఉండబోతుందో తెలుసుకొనేందుకు ఉత్సుకత కనబర్చారు.

కేలండర్ ఆవిష్కరణ

దిల్‌సుఖ్‌నగర్: ఉగాది సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో మంగళవారం తెలుగు నూతన సంవత్సర కేలండర్‌ను వేద పండితుల సమీక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం

వనస్థలిపురం:సచివాలయనగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ ఫోరం భవనంలో ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 80 వసంతాలు పూర్తి చేసుకున్న ఫోరం అధ్యక్షుడు డీఎన్‌వీ ప్రసాద్, సభ్యులు కె.లక్ష్మీపతి, కె.భాస్కర్‌రావు, ఎం.దామోదర్‌రెడ్డి, డి.సీతారామం, సోమనాథశర్మలను సత్కరించారు. ఫోరం ప్రధాన కార్యదర్శి వీపీకే బసవయ్య, కూర్మారావు, చంద్రశేఖర్‌రెడ్డి, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ చోరీ

సైదాబాద్: అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడ్డ దుండగులు హుండీని అపహరించి తీసుకెళ్లిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఇంద్రప్రస్థ కాలనీలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో స్వీపర్‌గా పని చేస్తున్న రేణుక సోమవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు రాగా ప్రధాన హుండీ కనిపించలేదు. వెంటనే ఆమె ఆలయ కమిటీ సభ్యులకు సమాచారమిచ్చింది. వారు ఆలయంలోని సీసీ పుటేజీని పరిశీలించగా సోమవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఆలయంలో తెరిచి ఉంచిన దక్షిణ ద్వారం నుంచి 20 -25 సంవత్సరాల వయస్సు గల ముగ్గురు వ్యక్తులు లోపలికి చొరబడ్డారు. ఆలయంలోని ప్రధాన హుండీని వారు అపహరించుకొని వెళ్లారు. ఆలయంలోని మరో హుండీని కూడా వారు ఎత్తుకెళ్లేందుకు యత్నించి విఫలమయ్యారు. చోరీకి గురైన హుండీలో భక్తులు సమర్పించిన రూ. 60 వేలు వరకూ ఉంటుందని సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో, తెలుగు సంవత్స రం ఉగాది కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వత్రాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

హస్తినాపురం: శబరిమలలో అయ్యప్ప స్వాములకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం అయ్యప్ప తత్వాన్ని కించపరిచే శక్తులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కర్మన్‌ఘాట్ హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయం వ్యవస్థాపక చైర్మన్, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. తెలంగాణ అయ్యప్ప ఐక్యవేదిక ముఖ్య గురుస్వాముల సమావేశం సోమవారం రాత్రి కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయంలో రమణ గురుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురుస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అయ్యప్ప మాల వేసుకొని లక్షలాది మంది భక్తులు శబరిమలకు వెళ్తున్నారని, అక్కడ స్వాములకు మంచినీరు, ఆహారం, వైద్య సదుపాయాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా అందడం లేదన్నారు. ఎన్నో అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని శబరిమలలో ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్తున్న భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చేసుకోవాలన్నారు. సమావేశంలో గురుస్వాముల ఐక్యవేదిక కన్వీనర్లు బాలకృష్ణ, గురుస్వామి, నాయని బుచ్చిరెడ్డి గురుస్వామి, రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్‌గాంధీ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి

నాగోలు: అందరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని కొత్తపేట మోహన్‌నగర్ ఎస్‌బీహెచ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ బంగారు రావు, ప్రముఖ జ్యోతిష్యుడు వైఎస్ఎన్ ప్రభు అన్నారు. మంగళవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీనియర్ సిటిజన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రభాష పండితుడు సుధాకర్ శర్మ ఇతర సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బంగారు రావు మాట్లాడుతూ, మన జీవితంలోని ఆత్మ, ప్రత్యగాత్మ, పరమాత్మ గురించి వివరించారు. ఆధ్యాత్మిక సమాచారం, సంగీత సాహిత్యాన్ని వివరించారు. సుధాకర్ శర్మ మాట్లాడుతూ భాగవతములోని ప్రహ్లాద చరిత్రను వివరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ముత్యాలప్ప, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం .రామదాసు, శ్రీధర్, నరసింహారావు, కందిబండ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కుమార్ జన్మదిన వేడుకలు



కార్పొరేటర్‌కు గధను బహూకరిస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం కొత్తపేటలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించారు. పవన్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వనస్థలిపురంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 40, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 21, క్యారెట్ 25, దొండ 18, ఆలు 35, ఉల్లి 22, గోకర 28, దోస 17, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 22, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 65. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి

వైభవంగా పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మినరసింహా స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు అజయ్ శర్మ, మురళీశర్మ, భక్తులు పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సహారా స్టేట్స్‌కాలనీ సీనియర్ సీటీజన్స్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నీటిని వృథా చేయవద్దని, ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగే విధంగా ప్రతి పౌరుడు బాధ్యతతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనే జ్ఞానేశ్వర్, కాలనీ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, గంగదాసు కృష్ణారెడ్డి, వెంకటాద్రి, జగత్‌రెడ్డి, రాఘవేందర్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రాంరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



మహ్మద్ గౌస్ (ఫైల్)

చంచల్‌గూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు తిరిగి రాని ఘటన సోమవారం మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన మహ్మద్ గౌస్ (85) గత శుక్రవారం ప్రార్థన కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో అతని కుమారుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

సైదాబాద్‌లో విద్యార్థిని ..

సైదాబాద్: పదో తరగతి పూర్తైన విద్యార్థిని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆచూకీ లేకుండాపోయిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మాదన్నపేట చంద్రయ్య హట్స్‌లో నివసించే స్వీపర్ గుండు యాదమ్మ పెద్ద కూతురు గుండు లహరి (16) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్షల అనంతరం విష్ణునగర్‌లో ఉండే పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఉంటోంది. ఇలా ఉండగా, సోమవారం యాదమ్మ విష్ణునగర్‌లోని తన అక్క ఇంటికి వచ్చి టీ పెడుతుండగా, బిస్కట్‌లు తెచ్చుకుంటానని చెప్పి బాలిక బయటకు వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో లహరి కోసం తల్లి స్థానికంగాను, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. తన కూతురు తమ బస్తీలోనే నివసించే రాజు అనే యువకుడితో చనువుగా ఉంటున్నట్లు గమనించామని, అతనే తమ కూతురు లహరిని తీసుకెళ్లి ఉంటాడని ఆమె అనుమానం వ్యక్తం చేసింది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోకి చొరబడి మహిళపై దాడి

- దంపతులతో పాటు మరికొందరిపై కేసులు
- పోలీసుల అదుపులో ఇద్దరు

నాగోలు: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి మరికొందరు యువకులతో కలిసి ఓ మహిళ ఇంట్లోకి చొరబడి అసభ్య పదజాలంతో దూషించి చంపుతామని బెదిరించాడు. ఈ ఘటనలో భార్యాభర్తలతో పాటు మరికొందరిపై ఎల్బీనగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం , షిరిడీ సాయినగర్ కాలనీలో భారతి, సైదాచారి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. అదే ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో యాదయ్య, అరుణ దంపతులు కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. యాదయ్య మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అతనితో పాటు మద్యం తాగిన మరికొందరు కాలనీకి వచ్చారు. తప్ప తాగి ఉన్నయాదయ్య తమ ఇరుగు పొరుగుతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇదే క్రమంలో భారతి ఇంట్లోకి యాదయ్య, అతడి భార్య అరుణ, మరికొందరు చొరబడ్డారు. భారతిని అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశారు. అదే కాలనీలో ఉన్న మీ సేవా కేంద్రంలోకి చొరబడి కంప్యూటర్లను ధ్వంసం చేసి నిర్వాహకుడు భరత్‌కుమార్‌ను కూడా బెదిరించారు. స్థానికులు 100కి కాల్ చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని సీఐ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సేవా సమితి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎండల తీవ్రతకు బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారికి, ఇతర పనులపై ప్రయాణం చేస్తున్నవారికి రోడ్డుపై ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలతో దాహాన్ని తీర్చుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా ఏదో ఒక సహాయం అందించాలని కోరారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా కూడా ఎంతో మందికి తన ట్రస్టు ద్వారా సేవలు అందించే ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సత్యసాయిబాబా చూపించిన మార్గాలు అందరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసేవా సమితి సభ్యులు గోపాలచారి, రామగౌడ్, భాస్కర్, పెంటారెడ్డి, వెంకటస్వామి, విఠల్, శంకర్, మధుసూదన్, చేవెళ్ల శాఖ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందిస్తాం



ఔట్ పేషంట్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న మాధవన్‌జీ

మహేశ్వరం: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ సమీపంలోని భగవతిపురంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య ధామ్ ఔట్ పేషంట్ ఆస్పత్రి బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ, గిరిజన తండాల్లో ఉన్న పేదలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు చేస్తామన్నారు. ఆరోగ్య ధామ్ పేరిట మాధవన్‌జీ ఆస్పత్రి, ఆయుర్వేదిక్, యూనాని, హోమియో, వెల్‌నెస్, యోగా శిక్షణ, ఆయుష్ కేంద్రం, ఆయుష్ పరిశోధన కేంద్రం, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజ్, ల్యాబ్స్, ఫిజియోథెరఫీ కాలేజీ, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, అంబులెన్స్ సేవలను భగవతిపురంలో దశలవారీగా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు, ఆస్పత్రి హెడ్ డా.కేతన్, వరుణ్, వెంకన్న, వైద్యులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రాజేష్ నాయక్

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జాతీయ బంజారా మిషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాట్రావత్ రాజేష్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని గొల్లూరులో సీబీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉగాది ప్రీమియర్ లీగ్ (యూపీఎల్-3)క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేతగా నిలిచిన నాగిరెడ్డిపల్లి తండా జట్టుకు ఆయన బహుమతులు అందజేశారు. ప్రతి సంవత్సరవం ఉగాది రోజున గొల్లూరు, గొల్లూరు తండా, నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తండా, హబీబుల్లాగూడ, డబిల్‌గూడ గ్రామాల్లోని క్రీడాకారులతో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో గొల్లూరు జట్టుపై నాగిరెడ్డిపల్లి తండా జట్టు విజయం సాధించిందన్నారు. విన్నర్‌గా జట్టుకు రూ.20వేల నగదు బహుమతి, షీల్డ్.. రన్నర్‌గా నిలిచిన గొల్లూరు జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి

చేవెళ్ల: వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం మండల నూతన అధ్యక్షుడిగా నియామకమైన కర్నె శివప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ముందుగా వీరశైవలింగాయత్‌ల ఆరాధ్యదైవం బసవేశ్వరుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మండల ఘంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులంతా కలిసి అధ్యక్షుడిగా కర్నె శివప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు.

నూతన కమిటీ సభ్యులు..

వీరశైవలింగాయత్ సంఘం మండల అధ్యక్షుడిగా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జె. వీరేశం(కుమ్మెర), ప్రధాన కార్యదర్శి జంగం ప్రసాద్(ఊరేళ్ల), కోశాధికారి వీరరేశం(ఊరేళ్ల), కార్యదర్శిగా విశ్వ నాథం(కందవాడ), గౌరవ అధ్యక్షుడిగా ప్రభులింగం(చేవెళ్ల), నాగేంద్రబాబు (ఊరేళ్ల) లను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రియాజ్

బడంగ్‌పేట్: చేవేళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా మాజీ మైనార్టీ చైర్మన్ మహమ్మద్ రియాజ్ ఖాన్ కాంగ్రెస్ గూటికి చేరారు. రియాజ్‌కు పార్టీ కండువా కప్పి రంజిత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో బడంగ్‌పేట గ్రేటర్ పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ మైనార్టీ చైర్మన్ మరియు మహేశ్వరం ని యోజకవర్గ మైనార్టీ అబ్జర్వర్ సయ్యద్ అఫ్జల్, అహ్మద్, బాబా భాయ్ తదితరులున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



మామిడిపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మామిడిపల్లిలో ఎడ్ల వాసుదేవారెడ్డి, పెరమోని నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక మజీద్‌లో మంగళవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని అన్నారు. అందరూకలిసిమెలిసి ఉండి పండుగలు నిర్వహించుకోవా లని కోరారు. మైనార్టీ నాయకులు.. మహ్మద్ నయీం, మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్ గౌడ్, గణేష్ గౌడ్, అలీ టుర్కీ, సయాద్ జాన్ తదితరులు పాల్గొ న్నారు. కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ యూసు ఫ్ పటేల్ ఆధ్వర్యంలో షాహీన్‌నగర్‌లో ఏర్పా టు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు నివాళి



రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: సీపీఐ నాయకుడు, స్వాతంత్ర సమర యోధుడు చంద్ర రాజేశ్వర్‌రావు వర్ధంతిని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని రావినారాయణరెడ్డి కాలనీలో మంగళవారం సీపీఐ నాయకులు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి మాట్లాడుతూ... రాజేశ్వర్‌రావు పేదల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, నిజాం నిరంకుశత్వానికి, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు హరిసింగ్ నాయక్, నవనీత, అరుణ, పుల్లయ్య, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

కాచిగూడ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న 8 లక్షల మంది విద్యార్థుల మెస్ బిల్లు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే చెల్లించి విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేయాలని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సైతం విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. హాస్టల్స్ మెస్ బిల్లులు, భవనాల అద్దె బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్ల మూతపడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని, దీని వల్ల ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి హాస్టళ్ల మెస్ బిల్లులు, హాస్టళ్ల భవనాల అద్దె బిల్లులు చెల్లించాలని కోరారు. పెండింగ్ బకాయి బిల్లులు చెల్లించపోతే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.